సిద్దిపేట
నమస్తే తెలంగాణ
శనివారం 11 జనవరి 2025
SATURDAY, JANUARY 11, 2025

పలువురికి హరీశ్‌రావు పరామర్శ

మాజీ ఎంపీటీసీ తిరుపతి, మెరుగు మల్లేశాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

నంగునూరు, జనవరి 10 : నంగునూరు మండలం అక్కెనపల్లి-సిద్దన్నపేట గ్రామాల మాజీ ఎంపీటీసీ బెదురు తిరుపతికి హైదరాబాద్‌లోని దవాఖానలో గుండె శస్త్ర చికిత్స జరుగుతున్న విషయాన్ని తెలుసుకొని శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు దవాఖానకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. తిరుపతికి, అతడి కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేట, జనవరి 10: బీఆర్‌ఎస్ యువ నాయకుడు మెరుగు మహేశ్ తండ్రి మల్లేశం హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు మల్లేశం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రంగనాయకసాగర్ నుంచి నీరు విడుదల చేయాలి

ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూర్, జనవరి 10: రంగనాయక సాగర్ రిజర్వాయర్ నుంచి సంక్రాంతిలోపు కాలువలకు సాగునీరు విడుదల చేసి చెరువులు నింపాలని కోరుతూ ఇరిగేషన్ ఈఈ గోపాలకృష్ణకు నారాయణరావుపేట మండలం బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరావుపేట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోనయ్యగారి ఎల్లయ్య, మాజీ ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ యాదవ్ మాట్లాడుతూ రంగనాయకసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఇరిగేషన్‌శాఖ మంత్రికి పలుమార్లు ఉత్తరాలు రాస్తే డిసెంబర్ చివరలో నీటిని విడుదల చేశారని తెలిపారు. తొందరగా నీటిని విడుదల చేయకపోవడంతో రైతుల పంట పొలాలు చాలావరకు ఎండిపోవడంతో చాలా నష్టపోయారన్నారు. మాజీ వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డి, గుర్రాలగొంది మాజీ సర్పంచ్ ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీలు హరీశ్ భానుచందర్, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిపాలన చేతగాకనే అక్రమ కేసులు

చిన్నకోడూరులో విలేకరులతో మాట్లాడుతున్న కాముని ఉమేశ్‌చంద్ర తదితరులు

చిన్నకోడూరు, జనవరి 10: పరిపాలన చేతగాకనే సీఎం రేవంత్ రెడ్డి అక్రమ కేసులు పెడుతున్నాడని సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కాముని ఉమేశ్‌చంద్ర మండిపడ్డారు. శుక్రవారం చిన్నకోడూరులో మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్‌తో ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్రమ కేసులు పెట్టి కేటీఆర్, హరీశ్‌రావును ఇబ్బంది పెట్టాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు. రాష్ట్రాన్ని నిండా ముంచడానికి రేవంత్‌రెడ్డి కంకణం కట్టుకున్నాడని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు కేసులు కొత్తేమి కాదన్నారు. తెలంగాణ కోసం పోరాడిన వీరులు హరీశ్‌రావు, కేటీఆర్ అని గుర్తుచేశారు. పెండింగ్ పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ద్వందనీతికి చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే విషయం గుర్తు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. సమావేశంలో తీగుల్ల రాజిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో రాణించడం అభినందనీయం

క్రీడాకారులను అభినందిస్తున్న టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హైదర్‌పటేల్

గజ్వేల్, జనవరి 10: జాతీయస్థాయిలో క్రీడాకారులు రాణించడం అభినందనీయమని టెన్నిస్ వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హైదర్‌పటేల్ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన 26వ జాతీయస్థాయి టెన్నిస్ వాలీబాల్ సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల చాంపియన్ షిప్‌లో తెలంగాణ నుంచి గజ్వేల్‌కు చెందిన క్రీడాకారులు యశ్వంత్, వివేక్, నర్సింహులు, భాను ప్రసాద్ పాల్గొని ప్రతిభ చూపి తెలంగాణ రాష్ట్ర జట్టు ద్వితీయస్థానంలో నిలువడం పట్ల వారిని అభినందించారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన పీఈటీలను అభినందించారు. పీడీలు నవీన్, రవీందర్, విజయరేఖ, గోవర్ధన్, పీఈటీ భాను పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానమే

ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేట టౌన్,జనవరి 10 : సిద్దిపేట జిల్లా జైలును జడ్జి స్వాతిరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఖైదీల యోగ క్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానమే అని, ఎవరిని వేరుచేసి చూడకూడదని అలా చేస్తే చట్టరీత్యా నేరంగా పరిగణిస్తామన్నారు. జైలర్ వికాస్,జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొమురవెల్లి, జనవరి 10 : మండలంలోని గురువన్నపేటకు చెందిన బచ్చల రమేశ్(32) గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శుక్రవారం బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించడంతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బుడిగె గురువయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీలు బచ్చల సాయిమల్లు, మకిలి కనకయ్య, మాజీ ఉపసర్పంచ్ నర్సింహులు, నాయకులు బుడిగె రమేశ్, ఎండీ అర్షద్, బచ్చల అశోక్, రాజనర్సు, కరుణాకర్, అజీమ్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో తనిఖీ

చేర్యాల, జనవరి 10 : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం డీఐఈవో రవీందర్‌రెడ్డి, స్టేట్ అబ్జర్వర్ కిషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.కళాశాలలోని రికార్డులు, ప్రాక్టికల్ ల్యాబ్స్ గదులను పరిశీలించారు.తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు యాక్షన్‌ప్లాన్ అమలవుతుందా లేదా అని ప్రశ్నించారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, జనవరి 10: వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ఆమె దవాఖానలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. త్వరలోనే మాతాశిశు నూతన దవాఖానను ప్రారంభించుకుంటామని, దాంతో మరింత మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. దవాఖానకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారికి నాణ్యమైన వైద్యం అందిస్తున్నామని, ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని, ప్రస్తుతం దవాఖానలో అన్ని రకాల వైద్యసేవలు అందుతున్నాయన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

బెజ్జంకి, జనవరి 10: రోడ్డు ప్రమాదాల నివారణపై మండల కేంద్రంలో శుక్రవారం ఆటో యూనియన్, యువకులకు ఏఎస్సై శంకర్‌రావు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపరాదన్నారు. కారు డ్రైవర్లు తప్పకుండా సీట్‌బెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

హుస్నాబాద్‌టౌన్: ముగ్గులను పరిశీలిస్తున్న రజితావెంకన్న

అక్కన్నపేట: విజేత మహిళలతో అధికారులు, నాయకులు

సిద్దిపేట కమాన్ : విజేతలకు వెండి కుంకుమ భరణి అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

హుస్నాబాద్: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ భిక్షపతి

సిద్దిపేట టౌన్: ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

గజ్వేల్: సింగాటం స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ స్కూళ్లు, డిగ్రీ కళాశాలలు, కస్తూర్బా స్కూళ్లలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు,మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. భోగి మంటలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు హరిదాసుల వేషధారణలతో సందడి చేశారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

–సిద్దిపేట జిల్లానెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, జనవరి10

మిరుదొడ్డి: మోతె ప్రాథమిక పాఠశాలలో ..

చేర్యాల: ముగ్గులు వేస్తున్న మహిళలు

సిద్దిపేట: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

జగదేవపూర్‌లో బహుమతులు అందజేస్తున్న ఎంపీవో ఖాజామొహినొద్దీన్

మద్దూరు(ధూళిమిట్ట): మద్దూరు కస్తూర్బా పాఠశాలలో...

కొండపాక(కుకునూరుపల్లి): విజేతలకు బహుమతులు అందజేస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

ప్రభుత్వ కార్యక్రమమా..? పార్టీ కార్యక్రమమా..?

చెక్కుల పంపిణీలో అంతా కాంగ్రెస్ నాయకులే

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కాంగ్రెస్ నాయకుడు

నంగునూరు, జనవరి 10 : ప్రభుత్వ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం విడ్డూరంగా ఉంది. శుక్రవారం నంగునూరు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ సరిత ఆధ్వర్యంలో మండల పరిధిలోని 38 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యక్రమం అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అత్యుత్సాహం చూయించారు. స్టేజీ పైన కూర్చోవడంతో పాటు చెక్కులను సైతం వారే పంపిణీ చేయడంతో అక్కడ ఉన్న వారంతా ఆశ్చర్యానికి గురయ్యారు. లబ్ధిదారులను ఉద్దేశించి కాంగ్రెస్ నేతలు ప్రసంగాలు కూడా చేయడం దారుణం. ప్రభుత్వ కార్యక్రమంలో ఎలాంటి ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఎప్పుడూ ప్రజాప్రతినిధులు, అధికారులు తప్ప ఏఒక్క పార్టీ నాయకుడు అధికారిక కార్యక్రమంలో పాల్గొనలేదు. కానీ కాంగ్రెస్ నాయకులు ఏ హోదా లేకున్నా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం వివాదాస్పదంగా మారింది.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

సిద్దిపేటలో రోడ్డు భద్రత మాసోత్సవ ర్యాలీలో ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేట టౌన్,జనవరి 10 : విద్యార్థి దశ నుంచే రోడ్డు,ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు.రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులతో కలిసి పట్టణ ప్రధాన చౌరస్తాలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మానవ తప్పిదాల వల్లనే అధిక శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన కుటుంబాల్లో విషాదాన్ని నింపవద్దని సూచించారు.ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే రోడ్డు ప్రమాదాలు జరగవన్నారు.ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్,ఎస్సై గోపాల్‌రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతికి అద్దం పట్టేలా పిండివంటలు

స్టాల్స్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, జనవరి 10: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా పిండి వంటలను చిన్నారులు విక్రయించడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రజ్ఞాపూర్ సెయింట్ మేరీస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ పిండివంటల స్టాల్స్‌ను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కరస్పాండెంట్ ఇన్నారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మల్లన్న' భక్తులకు అన్ని వసతులు కల్పిస్తాం

అగ్నిగుండం నిర్వహించే ప్రదేశంలో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న ఏఈవో శ్రీనివాస్‌యాదవ్

చేర్యాల, జనవరి 10 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఈవో బుద్ధి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మల్లన్న క్షేత్రంలో పట్నం వారం సందర్భంగా భక్తులకు కల్పించాల్సిన వసతులపై కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించి ఏఈ సతీశ్‌కు పలు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల19న పట్నం వారంతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయయనితెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశవర్కర్లకు వేతనం రూ.18వేలు ఇవ్వాలి

సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సిద్దిపేట అర్బన్,జనవరి 10: ఆశవర్కర్లకు వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల, ఎమ్మెల్యే హరీశ్‌రావు కార్యాలయ సిబ్బందికి ఆయన వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశ వర్కర్లకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాగ్య, కవిత, రేణుక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 10 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొండపాక మండలంలోని దుద్దెడ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోహెడ మండలంలోని తంగళ్లపల్లికి చెందిన ఎర్రవెల్లి బాలకిష్టయ్య(59) భార్య రేణుకతో కలిసి శుక్రవారం దుద్దెడ శివారులోని కలెక్టరేట్‌కు మోటర్ సైకిల్‌పై పని నిమిత్తం వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ మోటర్‌సైకిల్‌ను ఢీకొట్టింది. బాలకిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందగా భార్య రేణుకకు స్వల్పగాయాలయ్యా యి. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ప్రాజెక్టుల ద్వారా రైతాంగానికి సాగునీళ్లు వదలాలి

వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 10: మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ కెనాల్ ద్వారా రైతాంగానికి సాగునీళ్లను కూడవెల్లి, హల్దీ వాగుల్లోకి వెంటనే విడుదల చేయాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు నారుమళ్లు పోసుకొని సాగునీళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, సీజన్ ప్రారంభమై నాట్లు వేసే సమయం వచ్చినా సాగునీళ్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలువల ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి రైతులకు ఆదుకోవాలని, అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ సీజన్ ప్రారంభానికి ముందే వాగుల్లోకి నీటిని విడుదల చేయడంలో రైతులు సంతోషంగా నాట్లు వేసుకున్నారని గుర్తు చేశారు. అధికారులు స్పందించని పక్షంలో వేలాది మంది రైతులతో తామే కాలువల ద్వారా నీటిని విడుదల చేస్తామన్నారు. ఇప్పటి వరకు రైతులకు రూ.500బోనస్, రైతుభరోసా ఇవ్వలేదని, పూర్తిస్థాయిలో పంటరుణ మాఫీ కాలేదన్నారు. కేసీఆర్ ముందుచూపుతో రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్మాణం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులకు సాగునీళ్లు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు.

ముక్కోటి ఏకాదశి

కొడకండ్లలో స్వామివారిని దర్శించుకున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, జనవరి 10: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, మండలంలోని కొడకండ్లలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా భక్తులు స్వామివారిని ఉత్తరద్వార దర్శనం చేస్తున్నారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు. కొడకండ్ల ఆలయంలో స్వామివారిని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు.

అనాథ పిల్లలకు చేయూత

అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న సుల్తానాఉమర్

గజ్వేల్, జనవరి 10: మండల పరిధిలోని బంగ్లావెంకటాపూర్ గ్రామానికి చెందిన చిన్నారులకు ఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయం అందించారు. కొద్ది రోజులు క్రితం గ్రామానికి చెందిన దర్శనం నాగమణి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భర్త మతిస్థిమితం కోల్పోవడంతో ముగ్గురు చిన్నారుల భవిష్యత్‌కు భరోసా కల్పించడమే లక్ష్యంగా నిత్యావసర సరుకులు, బట్టలు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు మహమ్మద్ సుల్తానాఉమర్, ప్రధాన కార్యదర్శి పుట్ట రాజు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

చేర్యాల: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చేర్యాల, జనవరి 10 : మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బండారి రాజయ్యకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దినేశ్‌తివారీ శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం, గ్రామసీమల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు శవల్ల కిష్టయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల

కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

సిద్దిపేట, జనవరి10: ఆడబిడ్డల పెండ్లికి అండగా ఉండాలనే కల్యాణలక్ష్మి పథకాన్ని మాజీ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు అన్నారు. శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాల మేరకు సిద్దిపేట విపంచి కలానిలయంలో ఆర్డీవోతో కలిసి సిద్దిపేట నియోజకవర్గ అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు,ఆర్డీవో, అర్బన్, రూరల్ తహసీల్దార్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఉత్తీర్ణతశాతం పెంచాలి



మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి కిషన్

గజ్వేల్, జనవరి 10: ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేలా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇంటర్ బోర్డు పర్యవేక్షణాధికారి కిషన్, డీఐఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించిన సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. కళాశాలకు రాని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు వెంకటరమణ, ప్రకాశ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పల్లా పరామర్శ



మర్రిముచ్చాలలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, జనవరి 10 : మండలంలోని మర్రిముచ్చాలలో బీఆర్‌ఎస్ నాయకుడు చింతల ఉప్పలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించడంతో రూ. 5వేల ఆర్థికసాయం అందజేశాడు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ తలారి బాల్‌నర్సు కుటుంబ సభ్యులను పరామర్శించడంతో పాటు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడు చింతల ఉప్పలయ్య కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి రూ.8వేలు అందజేశారు.

నేడు వాలీబాల్ టోర్నమెంట్

కొమురవెల్లి, జనవరి 10 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బీఆర్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. టోర్నమెంట్‌లో గెలిచిన వారికి ప్రథమ బహుమతి రూ.11,111, ద్వితీయ బహుమతి రూ.5,555 నగదు అందజేయనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనేవారికి ఎలాంటి ఎంట్రీ ఫీజు లేదన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

నంగునూరు, జనవరి 10 : నాటుసారా తరలిస్తున్న నిందితుడిని పట్టుకొని 10 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని గట్లమల్యాలలో చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కన్నపేట మండలం మల్‌చెరువుతండాకు చెందిన గగులోత్ శ్రీను శుక్రవారం నాటుసారా తీసుకొని సిద్దిపేట వైపు వెళ్తున్నాడనే నమ్మదగిన సమాచారంపై మండలంలోని గట్లమల్యాల గ్రామ శివారులో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితుడిని ఆపి తనిఖీ చేయగా 10 లీటర్ల నాటుసారా లభ్యమైంది. ఈ మేరకు బైక్, 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని రాజగోపాల్‌పేట పోలీసులకు అప్పగించగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొమురవెల్లి, జనవరి 10 : మండలంలోని గురువన్నపేట సబ్‌స్టేషన్ 33కేవీ లైన్‌లో మరమ్మతు ల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని గురువన్నపేట, పోసాన్‌పల్లి, తపాస్‌పల్లి, ఐనాపూర్ గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మధు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మెరుగైన విద్యుత్ సరఫరాలో భాగంగా జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాని ఆయన కోరారు.

హైస్కూల్‌లో మాక్ పోలింగ్

తొగుట, జనవరి 10: మండలంలోని వెంకట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఎంఈవో వి.నరసయ్య, ప్రధానోపాధ్యాయురాలు నయీమాకౌసర్ పాల్గొన్నారు.

రాయపోల్‌లో...

రాయపోల్,జనవరి 10 :విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఎంఈవో సత్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, ఏఎస్సై దేవయ్య,ఏఎస్‌సీ చైర్‌పర్సన్ లావణ్య పాల్గొన్నారు.

ములుగులో..

ములుగు, జనవరి 10 : ములుగులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మేడ్చల్ జిల్లా విద్యాధికారి కిషన్‌తో కలిసి డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ శశికళ, అధ్యాపకులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

మర్కూక్,జనవరి10:మండలంలోని పాములపర్తిలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని పురవీధులగుండా ప్రధానదారిని కలుపుతూ ఉండే విధంగా సీసీలు బిగించారు. సీసీల ఏర్పాటుకోసం గ్రామస్తుల చొరవ మరువలేనిదని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ ఎస్సై దామోదర్,గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు,పురప్రముఖులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

హుస్నాబాద్, జనవరి 10: ప్రయాణికులను ఎక్కువ సంఖ్యలో ఎక్కించి ఓవర్‌లోడ్‌తో వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని ఏసీపీ సతీశ్ వాసాల ఆటోడ్రైవర్లకు సూచించారు. శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేశ్, హుస్నాబాద్ పట్టణ, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కుకునూరుపల్లిలో...

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 10 : కుకునూరుపల్లిలో ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో నడిపేవారందరికీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.